

# సానరాయి

పంతుల జోగారావు

స్నానం చేసి, పూజా పునస్కారాలు పూర్తి చేసుకుని ఈజీ ఛైర్‌లో కూచున్నాను. హైస్కూలు ప్యూను పోలయ్య టపా తీసుకుని వచ్చేడు.

కళ్ళజోడు పెట్టుకుని ఉత్తరాలు పరిశీలించ సాగాను. రెండు స్వంతానివి, మిగతా నాలుగూ స్కూలుకి సంబంధించిన ఉత్తరాలు.

నా పేర వచ్చిన వాటిలో ఒకటి మా పెద్దబ్బాయి రఘు విశాఖ నుంచి వ్రాసిన కార్డు. వాడక్కడ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్నాడు. వెంటనే రెండొందలు పంపమని రాసాడు. రెండోది చోడవరం నుంచి మా మామగారు రాసిన ఇన్లాండు కవరు. అక్కడ కింద పేడు ఓ ఎకరం పొలం కొని లేనిపోని గొడవల్లో ఇరుక్కున్నారు. వాటికి సంబంధించిన లావాదేవీల గురించి రాస్తూ, ప్లీడరు గారి ఫీజు నిమిత్తం అర్జంటుగా వందరూపాయలు పంపమని రాసారు. తప్పుతుందా ? విసుగ్గా నిట్టూర్చాను. ఇటు, అబ్బాయికీ, అటు మామగారికీ కూడా వెంటనే డబ్బు పంపించక తీరదు. ఇంట్లో చూస్తే పెద్దమ్మాయి పురిటికని వచ్చింది. అదో ఖర్చు. పేరుకి హెడ్మాష్టరునే కాని సంసారం పెద్దది కావటంచేత కొంచెం తడుముకోవాల్సి వస్తోంది.

ఆ ఉత్తరాలు రెండూ పక్కన పడేసి స్కూలు టపా తీసాను. అన్నీ అర్జంటు కాగితాలే. అర్జంటుగా నామినల్ రోల్స్ తయారుచేసి పంపించమని డి. ఇ. ఓ గారి ఉత్తర్వు. స్టైపెండ్ పర్టిక్యులర్స్ ఎందుకు పంపలేదని రిమైండరు. మూడోది ఇనస్పెక్షను రిపోర్టు అది చదివేక మతి పోయింది. ఘాటుగా వుంది. టీచర్ల యూనిట్ ప్లానులు అవీ సక్రమంగా లేవనీ, పెర ఫార్మెన్స్ ఇంకా బావుండాలనీనూ ! నాలుగో కవర్లో ఆడిట్ అబ్జక్షన్లు—

టపా ముడిచి స్కూలుకి తీసుకెళ్ళవలసిన బేగ్‌లో పెట్టి పోలయ్య చేతికిచ్చాను తాళాలిచ్చి పంపించాను. పోలయ్య వెళ్ళిపోయాక భోజనానికి లేచాను.

భోజనంచేసి వక్కపొడి నములుతూ వీధి వరండాలోనికి వచ్చేను. నా కోసమే కాబోలు ఎదురుచూస్తూ అక్కడో అబ్బాయినించుని వున్నాడు మాసిపోయిన చొక్కానిక్కరూ వేసుకుని వున్నాడు. తల పీచులారేగి వుంది. చేతిలో ఏవో రెండు పుస్తకాలున్నాయి, ముఖం దీనంగా వుంది.

'ఏం కావాలి ?' అన్నాను సిగరెట్ వెలిగిస్తూ. 'సార్ — చదువుకునే కుర్రాడినండీ — ఎనిమిదో తరగతిలో చేరాలండీ — అమ్మా నాన్న లేరండీ... మా మావయ్య దగ్గర వుంటున్నానండీ ... వాళ్ళు కూడా చాలా బీదవాళ్ళండీ... స్కూలు ఫీజు కట్టడానికి డబ్బులేదు సార్ — మీరేదైనా సహాయం చేస్తే స్కూల్లో జాయినవుతాను సార్...' అన్నాడు. వాడి గొంతులో ఏడుపుతో కూడిన జీర వినిపిస్తోంది.

నా కెందుకో వాడివన్నీ దొంగమాటలనిపించింది. వాడిగొంతు జాలి కలిగించే విధంగానే వున్నా అదంతా కేవలం నటనే అనిపించింది.

పోలియో - పక్షవాతము

పై వ్యాధులకు బాధపడువారు సుప్రసిద్ధ హోమియో వైద్యులు డా. బి. యస్. మూర్తి D H.M. (Ex.R.M O.) గారిని ప్రత్యేక చికిత్స కొరకు సంప్రదించండి.

శ్రీ రామకృష్ణా

హోమియో క్లినిక్,

11వ వార్డు ఏలూరురోడ్డు,
గుడివాడ (కృష్ణాజిల్లా)

**WHEN NATURE FAILS**

New మరింతఎత్తు, పొడుగు కాగలరు
H Super 2మంది 8అం. ఎదుగు పూర్తి
eight (For Super Heightness)
మీరూపొడుగు పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాత పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీ పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popular people.
1 Phail (20 T. A. B. S.) Rs. 7.50
advance By M.O. 3 Phails(60Tabs)
Rs. 15/- money order by advance.
M/S. VICTORIA COMMERCIAL COY,
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)
Correspond in English (AMW/3/78)

మీరిట్టే మెచ్చేది!

ఆర్కే

ఇన్‌స్టెంట్ ఇడ్లి మిక్స్




సెకండ్ల వ్యవధిలో రుబ్బే శ్రమ లేకుండా మెత్తని రుచికరమైన ఇడ్లీలు, ఇడ్లీలు పుష్టినిచ్చేవి
ఏ మాత్రం శ్రమ పడకుండా వాటిని కావాల్సినప్పుడు తయారుచేసుకోండి
ఇన్‌స్టెంట్ జామూన్ మిక్స్, వడ మిక్స్, దోశ మిక్స్ కూడా దొరుకుతాయి

ఆర్కే

వ్యాపారి వివరాలకు సంప్రదించండి:

శ్రీ రామకృష్ణ డయిరీ
179, విశ్వేశ్వర పురం బెంగుళూర్-560 004
టెలిఫోన్ 61482

# సానరాయి

తెల్లవారింది మొదలు యిలాంటివెన్నో చూస్తాం. దేశంలో అడుక్కోవడం పెద్ద ఇండస్ట్రీ అయిపోయింది. వీళ్ల జనాభా యిలా పెరిగిపోడానికి సోమరితనమేనని నా నమ్మకం, అదే కారణం అనుకుంటాను... దేవుడిపేరు చెప్పుకుని అడుక్కునే వాళ్లు కొందరుంటే- దీనజన సమాజం చందాలంటూ మరికొందరు! ఇల్లు కాలిపోయిందనో, దొంగలు పడి దోచుకుపోయారనో కట్టుకబుర్లతో యింకొందరు. ఈ మధ్య యీ సైజు కుర్రాళ్ళు స్కూల్లోచేరాలనీ- పరీక్షఫీజుకి డబ్బుల్లేవనీ రావటం రివాజయిపోయింది. ఇలాంటి వాళని ప్రోత్సహించకూడదు.

'అయితే ఏమంటావ్ ?' అడిగేను విసుగ్గా, ఆ అబ్బాయి కళ్లలో నీళ్ళు నింపుకుని అన్నాడు: 'సార్- మీకుతోచిన సాయం చెయ్యండి సార్ ! హైస్కూలుకి పోయి హెడ్మాష్టరుగారి కాళ్లు పట్టుకుని జాయినవుతాను – నామాట నమ్మండిసార్' అని ప్రాధేయపడ్డాడు.

అయితే నేనే హెడ్మాష్టరునని వీడికి తెలీదన్నమాట! ఇంటిబయట నేమ్‌బోర్డు తగిలించే అలవాటు నాకు తొలినుంచీలేదు– నేను హెడ్మాష్టరునని తెలిస్తే యిలా వచ్చేవాడుకాడేమో ? రావడానికి వాడికెన్ని గుండెలుండాలి...

'వెళ్ళబ్బాయ్ ... నాదగ్గరేం లేదు...' అనేసి టైం చూసాను. తొమ్మిదీ అయిదయింది. గదిలోకివెళ్లి పంచె కమీజు వేసుకున్నాను. 'మధ్యాహ్నం పిల్లల్ని తీసుకుని మేట్నీకి వెళ్దామనుకుంటున్నానండీ–ఆ సావిత్రమ్మగారు కలిసి వెళ్దాంరమ్మని పదిరోజులుగా పూరికే యిదవుతున్నారు' అనడిగింది జానకి. ఆవిడగారి చిన్నకోరికని తీర్చకపోతే ఎలా ! 'ఓయస్' అని నవ్వేసిప దిరూపాయల నోటుతీసి ఆవిడకిచ్చాను. నవ్వుతూ అందుకుంది. 'మధ్యాహ్నం ఓసారి పోలయ్యని యింటికి పంపించండీ–టిక్కెట్లుతీసి పెడతాడు' అంది. తల వూపి వరండాలోకి వచ్చాను.

ఆ అబ్బాయి యింకా అక్కడే నిల్చుని వున్నాడు. నాకు చిరాకనిపించింది. 'ఏం అబ్బాయ్ – వెళ్ళమనిచెప్తే నీక్కాదూ ? ఇంకా దిష్టిబొమ్మలా నిల్చుంటావేం –

## మల్లె

నువ్వు రాల్చి వెళ్లిన మల్లె
నా చేతికి దొరికింది
నన్ను విడవనంది
తన్ను విడవకంది.
భాషకందని నీ నవ్వులాంటి
పరిమళంతో
పరవశంగా నన్ను కమ్ముకుంది ...

* * *

మురిసిన మల్లె సొమ్మసిల్లింది
అదిగో నా ముందు
నీ లాగే ...
అపురూపమైన
ఈ రాత్రి
అనుభూతిలా
నా అదృష్టంలా
నీలా
మల్లె
తన్ను విడవకంది... నన్ను
విడవనంది —

-కే ఎస్వీ

నీలాంటివాళ్లని చాలామందిని చూసాను ... అడుక్కోడానికిదో ఎత్తుకాకపోతే – ఎక్కడో చిన్నపని చూసుకోరాదూ ? అని కసిరేను.

ఆ కుర్రాడు చేతులుకట్టుకుని, దుఃఖం దిగమింగుతున్నట్టుగా గుటకలుమింగి – 'లేదుసార్–నామాట నమ్మండి సార్ ...నేను నిజంగా చదువుకునే అబ్బాయినే సార్...' అన్నాడు.

'చాల్లే...గెటవుట్–ఏ చదువురాని వాడి దగ్గరో నీ నంగనాచి కబుర్లు పనిచేస్తాయి. నీవాలకంచూసి కరిగిపోయి సహాయంచేస్తాడు. నాలాంటి వాడిదగ్గర నీ ఆటలు సాగవు – ఫో !' అన్నాను కొంచెం విసురుగా.

ఆ అబ్బాయి కళ్లు వర్షించటం ప్రారంభించాయి. దుఃఖం ఆపుకోలేక బెక్కుతున్నాడు. నామనసు కొంచెం చలించింది. కాని వెంటనే–ఇలాంటివాళ్ల దొంగఏడుపులకీ – బూటకపుకన్నీటికీ చలించిపోవటం హాస్యాస్పదంగా తోచింది. జిడ్డులాగా వదలడేం ? విసిగిపోయి త్రుణమో పణమో పారేస్తాననుకున్నాడు కాబోలు ! నేను వాడికంటే మొండివాడ్ని – జలగలాగా పట్టుకుని వెంటపడితే వదుల్చుకోడానికి

వాడి మాటలకి లొంగిపోయే రకం కాదని నిరూపించాలను కున్నాను.

చెప్పులలో కాళ్ళు దూరుస్తూ- 'ఇవాళ వూళ్ళో ఏ సినిమా రిలీజయిందేమిటి ?' అన్నాను వ్యంగ్యంగా.

వాడు నావేపు అదోలా చూసాడు. భయం భయంగా అడిగేడు. 'ఎందుకు సార్ ?' అని.

'మరేంలేదు- తమరు ఏ సినిమాకి దయ చేస్తారా అనీ-' అన్నాను వెటకారంగా. కావాలనే కటువుగా ప్రవర్తించాను. ఇలాంటి వాళ్ళకిలాగే బుద్ధి చెప్పాలి' అను కున్నాను మనసులో.

ఆ అబ్బాయి నీరు కారిపోయేడు. మరేం మాట్లాడలేదు. తలొంచుకుని మౌనంగా వెళ్ళిపోయేడు.

'దొంగ వెధవ... అసలు గుట్టు కాస్త బయట పెట్టేసరికి చల్లగా జారుకున్నాడు!' నవ్వుకుని స్కూలుకి బయలు దేరాను.

రిక్షా హైస్కూలు మలుపు తిరుగుతూ వుంటే చలపతి కనిపించాడు. వాడూ నేనూ చిన్నప్పటి నుంచీ స్నేహితులం. ఇద్దరం పార్వతీపురంలోనే చదువుకున్నాం. సెకండరీ విద్య పూర్తయేక నేను విజయనగరం మహారాజా కాలేజీలో చేరాను. వాడు టైపు నేర్చుకుని యిక్కడే కలక్టరాఫీసులో టైపిస్టుగా చేరాడు.

'నీ దగ్గరకే వస్తున్నాను కేశవరావ్' అన్నాడు నన్నుచూసి పలకరిస్తూ. 'ఏమిట్రా సంగతులు ?' అని ప్రశ్నించాను. కాసేపు అవీ యివీ మాట్లాడేక- భార్యకి వొంట్లో బాగులేదనీ-జబ్బు చేసి చాలా చికాకు చేసిం దనీ- ఇప్పుడే ఇంకా హాస్పిటల్ నుంచి డిస్చార్జ్అయి యింటి కొచ్చిందనీ చెప్పాడు.

'అంత చికాకు చేస్తే కబురు చెయ్యలేక పోయావూ ?' అడిగేను కాని వారం రోజులుగా నేను కేంప్‌లో వున్న సంగతి గుర్తొచ్చింది. డబ్బుకి యిబ్బందిగా వుందనీ—పాతికో పరకో సర్దమనీ అడిగేడు చలపతి. అడగలేక అడగలేక అడుగు తున్నట్టుగా వాడిముఖమే చెప్తోంది. నాకు బాధగా అనిపించింది.

చిన్నప్పుడు ఎంతో సరదాగా వుల్లాసంగా వుండే చలపతి ఎలా తయారయ్యాడు ! ఎన్నడూ వాడిముఖంలో విచారరేఖలె కని పించేవికావు — నవ్వులగనిలా వుండేవాడు. అలాంటిచలపతి ముఖంలో ఎంత నిర్లిప్తత! ఎంత వుదాసీనత ! పాపం, ఆర్థికసమస్యలు— మనిషిని మానసికంగా ఎంత దిగజార్చి వేస్తాయో తలుచుకుంటేఆశ్చర్యంవేస్తోంది. విశాఖపట్నం సముద్రంలో ఉవ్వెత్తున ఉత్సాహంగా ఎగిసిపడే కడలితరంగాలు — నల్లని కరిన శిలలమీదపడి, తలలు బద్దలు చేసు కున్నట్టుగా—ఆనాటి వీడి ఉత్సాహం — వుద్రేకం—ఆ చొరవ—యివన్నీ జీవిత వాస్తవాల శిలల్ని ఢీకొట్టి వ్రయ్యలయి పోయేయి కాబోలు !

బాధగా నిట్టూర్చి, జేబులోనుంచి పాతిక రూపాయలు తీసి వాడికిచ్చాను.

మరీ మరీ కృతజ్ఞతలు చెప్తూ వాడు వెళ్ళిపోయేడు. రిక్షా కదిలింది.

* * *

రెండురోజులు గడచాయి చలపతి వాళ్ళింటికి వెళ్దామంటే ఎక్కడా తీరిక చిక్కలేదు. వాడిభార్య కెలాగుందో ? నిన్న సాయంత్రం కనిపించి జబ్బు మళ్ళీ తిరగ బెట్టిందని అన్నాడు విశాఖపట్నం తీసుకు పోతున్నానని చెప్పేడు.

ఆవేళ స్కూల్లో చాలాబిజీగా వున్నాను. పిల్లలు జీతాలుకట్టడానికి ఆరోజు చివరి రోజు. స్పెషల్‌ఫీజు పుస్తకాలు దొంతర్లుగా నా సంతకాలకోసం టేబిలుమీద ఎదురు చూస్తున్నాయి. విద్యార్థుల అడ్మిషన్లు కూడా ఆ రోజుతో పూర్తయేలా వున్నాయి పనిభారం జాస్తీగానేవుంది.

పోలయ్య ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసి యిచ్చాడు. కాఫీ చప్పరిస్తూవుంటే ఎవరో వో వ్యక్తి ఆఫీసురూంలోకి వచ్చేడు. మనిషి చూడ్డానికి చాలాబీదవాడిలా వున్నాడు.

'ఏం కావాలి ?' మా క్లర్కు అడిగే డతన్ని.

'మా మేనల్లుడ్ని ఎనిమిదో తరగతిలో జాయను చెయ్యాలని వచ్చానండీ — ఇదిగో నండీ అప్లికేషను' అంటూ పూర్తి చేసిన అప్లికేషను ఫారం టేబిలమీద వుంచాడు.

అతనివేపు ఎగాదిగాచూసి, క్లర్కు ఆ ఫారం పరిశీలించి నా కందించారు.

'కుర్రాడేడీ, రమ్మను' అన్నాను దాని నందుకుంటూ.

'శీనూ ! లోపలికిరారా' పిలిచేడతను.

లోపలికి వచ్చిన అబ్బాయిని చూసి నిశ్చేష్టుడినయ్యాను - నా నోట మాట రాలేదు— కడుపులో ఎవరో చెయ్యి పెట్టి దేవినట్లయింది రెండురోజుల క్రిందట నా దగ్గరికి ఫీజుకోసం డబ్బడగడానికివచ్చింది వాడే! వాడూ నన్ను ఇట్టే పోల్చుకున్నాడు. నన్నుచూసి భయపడ్డట్టు కనిపించింది. తనని అడ్మిట్ చేసుకోనుపొమ్మని అనేస్తానే మోనన్న దిగులు వాడి కళ్ళలో చూసి చలించిపోయాను.

గిల్టీగా ఫీలయ్యాను. మనసంతా అదోలా తయారయింది

'ఫీజు తెచ్చావా?' అడిగేను గొంతు పెగుల్చుకుని. తలూపేడు. 'సరేలే— ఇప్పటి కేదో ఫీజు కడతావు సరే— ముందు ముందు చాల ఖర్చులుంటాయి... పుస్తకాలూ, అవీ— ఆసంగతి ఆలోచించావా?' అన్నాను డాంబికంగా. అలా అడగటానికి నా మనసు



# సానరాయి

బాగా వ్యతిరేకించిన మాట మాత్రం వాస్తవం.

'బాబూ!... ఏదో తమలాంటి పెద్దలు పదిమంది దగ్గరకెళ్ళి చెయ్యిజాపి తెస్తాను బాబూ! శీను తల్లీదండ్రీలేనివాడుబాబూ... నేనూ బీదవాడినే బాబూ! వాడ్ని చదువు లేని వాడిగాచేసి ఆ పాపం కట్టుకోలేను— దయగల పెద్దలు కనికరిస్తే వాడ్ని పదో తరగతి వరకయినా చదివించాలనుకుంటు న్నాను బాబూ!' అతని గొంతు అతిదీనంగా ఉంది.

నేను మరేం ప్రశ్నించకుండా అతనిచ్చిన అప్లికేషను ఫారంమీద 'అడ్మిట్' అని రాసి సంతకం చేసాను.

ఆ ఫారం అందుకుని, 'ఫీజు డబ్బులిప్పు' అంటూ రశీదు పుస్తకం తీసాడు క్లర్కు.

అతని టేబిలు మీద చిల్లర డబ్బులు గలగలమని పడిన చప్పుడు వినిపించి, సిగ్గుతో నా మనసు కుంగిపోయింది. బాధగా నిట్టూర్చాను.

*　　　*　　　*

ఆ సాయంత్రం స్కూలు పని పూర్తయాక మనసు బాగుండక నేరుగా యింటికి వెళ్ళాలనిపించలేదు. హోటల్‌లో కాఫీ తాగి తాపీగా నడుచుకుంటూ పార్కు వేపు దారి తీసాను.

నా మనసులో ఆ సంఘటనే మెదులుతోంది. తప్పు చేసినట్టు బాధపడ సాగాను. ఆలోచిస్తూ నడుస్తున్న నాకు— దారిలో పద్మశ్రీ థియేటరు దగ్గర కనిపించిన దృశ్యం ఆశ్చర్యం కలిగించింది.

అక్కడ—

టిక్కెట్స్ విండో దగ్గర— చలపతి, అతని భార్య నిలుచుని వున్నారు. ఆవిడ —తలలో మల్లెపూలు పెట్టుకుని—నవ్వుతూ అతనితో ఏదో అంటోంది. నిండుగా దబ్బపండులా వుంది. ఎక్కడా మంచాన పడిన లక్షణాలే లేవు! ఆవిడకి జబ్బు చేసిందని కాదూ' చలపతి నన్ను డబ్బులడిగింది ?

మైగాడ్! ఎంత మోసం... నా గుండె కోపంతో మండి పోతున్నట్లనిపించింది. మనసు వికలమై పోయింది. వాళ్ళు నావేపు చూడకుండా పార్కులో అడుగు పెట్టాను.

'సార్... చదువుకునే కుర్రాడినండీ ... ఏయిత్‌లో జాయినయానండీ... పుస్తకాలు కొనడానికి డబ్బుల్లేవండీ— ప్లీజ్...' ఎవరివెంటో నడుస్తూ అడుగుతున్న శీను కనిపించి ఆగిపోయేను. 'నమస్తే సార్...' అని బిత్తరచూపులు చూస్తూ ప్రక్కకి తొలగి వెళ్ళిపోయేడు వాడు.

ఎవ్వరో వెక్కిరించినట్టయింది. బాధగా నిట్టూర్చాను. పార్కులో కూచుని సిగరెట్ వెలిగించాక కొంచెం స్థిమితపడ్డాను. 'ఛీ! ఎంత తెలివితక్కువగా ప్రవర్తించాను ? లోకంలో మోసాల్నీ, కుటిలత్వాన్నీ చూడ గలగటానికి ఈ రెండుకళ్ళూ చాలను కున్నాను...కాని...విచక్షణాదృష్టి — మనో నేత్రం ఇవికూడా అవసరమని గుర్తించలేక పోయాను !

ఏది రత్నమో, ఏది పాషాణమో తెలుసుకో గలిగే షరాబులాంటివాడు ఉపాధ్యాయుడు... రత్నాలనీ, బంగారాన్నీ సానబట్టి మెరుగు తేవటానికి వుపయోగించే సానరాయిలాంటిది అతని ఉపాధ్యాయవృత్తి !

అలాంటిది...తను...కృత్రిమ విలువలకి ప్రాధాన్యతనిచ్చి మోసపోయేడన్నమాట ! నామీద నాకే అసహ్యం వేసింది.

'సార్...చదువుకునె అబ్బాయినండీ...' శీనుమాటలు నా చెవుల్లో గింగుర్లు తిరుగు తున్నాయి.

## కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరుపెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం విజయవాడ 3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరు మీద ఆ సంచికపేరు ఉదహరించాలి. ఈ కార్టూన్లకికూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

సం.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి

డా॥ దేవర, షాక్ 551, మార్వాడి గుడివద్ద, తెనాలి. బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.







ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి

VIJAYA : MPM